క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం 132 కేవీ నుంచి 33/11 కేవీ సబ్‌స్టేషన్ వరకు లైన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా మండల హెడ్ క్వార్టర్ లైన్‌లోని వేములవలస, వెల్లంకి, భీమిలి క్రాస్ రోడ్డు, సత్య కల్యాణి అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాల గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేవిడి ఫీడర్ పరిధిలో..

పద్మనాభం: మండలంలోని రేవిడి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అనంతవరం, గంధవరం, పెంట, కొవ్వాడ, గొల్లలపాలెం, తిమ్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

జనాభా దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు

భీమునిపట్నం: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు భీమిలిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ గురువారం తెలిపారు. భీమిలి పరిధిలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులకు జూలై 7న పోటీలను నిర్వహిస్తామన్నారు. మాదకద్రవ్యాలు, పొగాకు వల్ల కలిగే అనర్థాలపై చిత్రలేఖన పోటీలు, లింగ సమానత్వం, గౌరవం అంశాలపై వ్యాసరచన పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి 9వ తేదీన జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని, ఆ పోటీల్లోనూ గెలిచే వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలియజేశారు. ఒక్కో పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం కల్పిస్తారని వివరించారు. ఇతర వివరాలకు అధ్యాపకులు సునీత (ఫోన్ :97047 19772) అల్లావుద్దీన్ (ఫోన్ : 9885941559)లను సంప్రదించాలని సూచించారు.

అల్లూరి జయంతికి ఏర్పాట్లు



సభా వేదిక వద్ద వేసిన టెంటు

పద్మనాభం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఆయన జన్మస్థలమైన పాండ్రంగిలో శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అల్లూరి వేదికకు రంగులు వేశారు. అక్కడే టెంట్లు వేసి సిద్ధం చేశారు. ఇక్కడే సమావేశం నిర్వహించనున్నారు. జయంతి వేడుకలు సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కానున్నారు.

దాకమర్రిలో గ్రావెల్ దోపిడీ

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా వీఎంఆర్‌డీఏ లేఅవుట్ వెనుక ఉన్న కొండనుంచి రాత్రి వేళ యథేచ్ఛగా గ్రావెల్ తరలించుకుపోతున్నారు. నిత్యం చీకటి పడిన తరువాత పదుల సంఖ్యలో లారీలను తీసుకువచ్చి గ్రావెల్ తరలిస్తూ, పచ్చదనానికి తూట్లు పొడుస్తున్నారని పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి కూటమి నాయకులే ఈ గ్రావెల్‌ను తరలిస్తున్నారని పంచాయతీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ తరలింపుపై రెవెన్యూ సిబ్బంది నిఘా ఉంచి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆయాలకు 3 నెలల జీతాల విడుదల

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయాలకు ఎట్టకేలకు మూడు నెలల జీతాలు రూ.18వేలు వంతున గురువారం వారి ఖాతాలకు జమ చేశారు. 'ఆయాలకు 4 నెలలుగా అందని జీతాలు' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. పాఠశాలల్లో వాష్‌రూమ్‌లు, ఆవరణ, తరగతి గదులు శుభ్రం చేయడంతో పాటు తాగునీరు మోసుకుని వచ్చే ఆయాలకు ఈ ఏడాది మార్చి 15 తరువాత నుంచి జీతాలు విడుదల చేయలేదు. సాక్షి వార్తతో ప్రభుత్వంలో కదలిక వచ్చి జీతాలు విడుదల చేయడంతో ఆయాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. అయితే, నిబంధనలు పాటించని పరిశ్రమల యాజమాన్యాల కారణంగా వెల్లంకివాసులకు ఆ రెండూ దూరమయ్యాయి. పైగా ఈ పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలతో రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో ఒకవైపు పీల్చే గాలి, తినే తిండి, తాగే నీరు కూడా కలుషితమై.. మరోవైపు సరైన రోడ్లు కూడా లేక దయనీయ స్థితిలో జీవిస్తున్నారు ఆ ప్రాంతాల్లో ప్రజలు.

అడుగు వేయలేం.. గాలి పీల్చలేం..



వెల్లంకి పారిశ్రామిక ప్రాంతం మధ్యలో చెరువును తలపిస్తున్న రహదారి



వెల్లంకి నుంచి గారిపేటకు వెళ్లే రహదారి దుస్థితి



వెల్లంకి రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లకు వెళ్లే మార్గంలో బురద



వెల్లంకి జెడ్పీ హైస్కూల్ ముందు గోతులు

- వెల్లంకి వాసుల ఆవేదన
- పరిశ్రమల కారణంగా గాలి, నీరు కలుషితం
- భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ఛిద్రం
- పట్టించుకోని అధికార గణం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి గతంలో కూరగాయలు, ఆకుకూరలు, పువ్వుల సాగుకు ప్రసిద్ధి. ముఖ్యంగా నవనవలాడే వెల్లంకి వంకాయల పేరు చెపితే ఎవరికైనా నోరు ఊరవలసిందే. వీటికి ప్రత్యేక ధర ఉండేది. ఇలాంటి వెల్లంకిని భౌగోళికంగా, పర్యావరణంగా దెబ్బ తీస్తోంది ఇక్కడ ఏర్పడిన పారిశ్రామిక ప్రాంతం.

20 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ ప్రాంతంలో ప్రస్తుతం 18 వరకు పరిశ్రమలు పంచాయతీలోని వెల్లంకి, గారిపేట, బొడ్డపాలెం గ్రామాలలో ఉన్నాయి. ఇందులో సీ ఫుడ్స్, ఫ్లై వుడ్స్, ఐరన్, ప్లాస్టిక్, సిమెంట్, గ్లాస్, సిమెంట్ పైప్స్, రెడీ మిక్సింగ్ ప్లాంట్‌లు, ఈవెంట్లు నిర్వహించే సంస్థలు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. నిత్యం ఈ పరిశ్రమలకు భారీ వాహనాల రాకపోకలతో శివారు రహదారులు ఛిద్రమైపోయాయి. వీటి వ్యర్థాలు రోడ్డు పక్కనే డంప్ చేయడం, వస్తు తయారీ సమయంలో వెలువడే కాలుష్యంతో ప్రస్తుతం ఇక్కడ గాలి పీల్చాలన్నా వ్యాధుల భయంతో ఆందోళన చెందుతున్నారు. పరిశ్రమల యజమానులు ఇక్కడి చెరువులను కూడా కబ్జా చేసేయడంతో ఈ పంచాయతీలో రియల్ ఎస్టేట్ వ్యాపారం దారుణంగా పడిపోయింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దీని చుట్టుపక్కల పంచాయతీలలో గజం భూమి ధర రూ.30వేల నుంచి రూ.40వేలు ఉండగా వెల్లంకిలో మాత్రం రూ.15వేలు దాటడం లేదు.

పరిశ్రమలపై చర్యలేవీ?

కాలుష్యంతో పాటు రహదారులను దెబ్బతీస్తున్న పరిశ్రమలపై ఒకరిద్దరు న్యాయ పోరాటం చేసి కొంత విజయం సాధించినప్పటికీ ప్రభుత్వం నుంచి ప్రజలకు ఎలాంటి సాయం అందడం లేదు. పరిశ్రమలలో వినియోగించే ముడి పదార్థాలను తడపడం, చుట్టూ కనిపించకుండా రేకులను అడ్డం పెట్టడం, చిమ్నీల ఎత్తు పెంచడంతోనే సరిపెట్టారు. దీంతో పరిశ్రమల నుంచి నిత్యం ప్లాస్టిక్, ఐరన్ అణువులు, ధూళి, అమ్మోనియం వంటి రసాయనాలు, గ్యాస్, నల్లటి పొగ కారణంగా పరిసరాలు కలుషితం అవుతున్నాయి.

పరిశ్రమల తరలింపుతోనే పరిష్కారం

వర్షాకాలంలో ఇక్కడి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పంచాయతీలో కిడ్నీ, ఊపిరితిత్తుల, శ్వాసకోశ సమస్యలు, అసాధారణ జ్వరాలు సర్వసాధారణం అయిపోయాయి. ఇక చీకటి పడితే భారీ టిప్పర్ల రాకపోకల కారణంగా ఈ ప్రాంతవాసులకు రాత్రివేళ కంటిమీద నిద్రే కరువు అవుతోంది. ముఖ్యంగా పంచాయతీలో ఎస్సీ కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలకు చెందిన 250 కుటుంబాల వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ పరిశ్రమల ప్రభావం ఇక్కడే ఉన్న జెడ్పీ హైస్కూల్, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లకు వచ్చే విద్యార్థులు, ప్రజలు, రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పరిశ్రమల నుంచి ఎదురవుతున్న సమస్యలు పంచాయతీ అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని వాపోతున్నారు. అన్నివిధాలుగా నష్టం కలిగిస్తున్న పరిశ్రమలను గతంలో ప్రతిపాదించినట్లుగా మండల శివారుకు తరలించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

మా బాధలు వర్ణనాతీతం



వేసవిలో ఇక్కడి పరిశ్రమల నుంచి వెలువడే ధూళి తెట్టులా పేరుకుపోతుంది. ఇక సీ ఫుడ్స్ పరిశ్రమ నుంచి ద్రవ కాలుష్యం గ్రామంలో చేరుతుంది. ప్లాస్టిక్, ఐరన్, చెక్క అణువులు నిత్యం కోట్లలో గ్రామంలో చేరుతుంటాయి. తాగేనీరు కూడా కలుషితం అయింది. పలువురు కిడ్నీ సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు లేవు.

– వాసి దేవరాజ్, వెల్లంకి



పారిశ్రామిక ప్రాంతం నుంచి వెల్లంకి గ్రామానికి వెళ్లే మార్గం

తినే తిండి, తాగే నీరు కలుషితం



ఇక్కడి పరిశ్రమల నుంచి పని సమయంలో వ్యర్థాలే కాకుండా లోపలి నుంచి వ్యర్థాలు తీసుకువచ్చి రహదారులకు ఇరువైపులా, జెడ్పీ హైస్కూల్ ప్రహరీల వద్ద పడేస్తారు. అసలు నివాసాలు, విద్యాసంస్థలకు చేరువలో ప్రమాదకరమైన పరిశ్రమలు ఏమిటో? యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా తినే తిండి, తాగేనీరు కూడా కలుషితమవుతున్నాయి.

– మండే శంకర్, వెల్లంకి

పరిశ్రమల యజమానులదే బాధ్యత



పరిశ్రమల కారణంగా గోతుల్లా మారిన రోడ్లను ఆ యాజమాన్యాలతోనే వేయించాలి. స్థానికుల ఆరోగ్యం, రక్షణపై పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యత తీసుకోవాలి. పరిశ్రమలచే ఆక్రమించబడిన గెడ్డలు, చెరువులను ప్రభుత్వం గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రమాదకరమైన వ్యర్థాలు నేరుగా కాకుండా ఎస్‌టీపీ ద్వారా బయటకు పంపించాలి.

– కొమ్ము ఆశిబాబు, వెల్లంకి

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మొక్కలు నాటుతున్న రమణమ్మ

పద్మనాభం: సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) భీమునిపట్నం సబ్ డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ డి.రమణమ్మ సూచించారు. మండలంలోని పాండ్రంగి పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సహకార దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సహకార సంఘాలు ఇస్తున్న రుణాల గురించి రైతులకు వివరించారు. సంఘం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.మహేష్, మహంతి అప్పలరమణ, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఉపాధ్యాయుల కానుక



పాఠశాలకు బీరువా బహూకరిస్తున్న బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు

తగరపువలస: తాము పని చేసిన పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను బహూకరించారు కొందరు ఉపాధ్యాయులు. భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీపై వెళ్లారు. వారు పాఠశాలకు జ్ఞాపికగా ఏమైనా ఇవ్వాలని భావించి, బీరువాను, ఫర్నిచర్‌ను సమకూర్చారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వాటిని అందజేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ప్రస్తుత ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాలకు వారందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు టీఎస్‌వీ ప్రసాదరావు, వి.శ్రీనివాస్, కె.ప్రభావతి, కృష్ణవేణి, సునీత, విజయకుమారి, జమ్ము అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే చెరువే..

- డ్రైనేజీల్లేక తరచూ నిలిచిపోతున్న నీరు
- శాశ్వత పరిష్కారానికి స్థానికుల వినతి



వర్షాల సమయంలో నీటితో నిండిపోయిన రోడ్డు

భీమునిపట్నం: వర్షాలు పడే సమయంలో భీమిలి నుంచి తగరపువలసకు వెళ్లే మార్గంలో రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ జమ్మిచెరువు పార్కు దాటిన తరువాత కొద్ది దూరంలో ఈ పరిస్థితి నెలకొంటోంది. ఇక్కడ రోడ్డు లోతట్టుగా ఉండడంతో పాటు రోడ్డుపక్కన కాలువలు సరిగ్గా లేవు. దీంతో భారీ వర్షాలు పడే సమయాల్లో చుట్టుపక్కల గెడ్డల ద్వారా నీరు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చేస్తోంది. తద్వారా వుడా మైదానం వరకు నీరు నిలిచిపోతోంది. దీనివల్ల ద్విచక్రవాహనాలు, ఆటోలు తిరగడానికి చాలా ఇబ్బందిగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో వీటితో పాటు కార్లు తిరగడానికి కూడా అవకాశం లేనంతగా నీరు ఉండడంతో చాలాసేపు వాహనాల రాకపోకలను నిలిపివేయవలసి వస్తోంది. దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు దెబ్బతిన్న సందర్భాల్లో చాలాసార్లు కొత్త రోడ్డును వేయడం, మరమ్మతులు నిర్వహించడం చేస్తున్నారు తప్ప రోడ్డును ఎత్తు చేసే పనిమాత్రం చేయడం లేదు. అందువల్ల ఈ సమస్య అలాగే ఉండిపోయింది. ఇప్పుడు వర్షాకాలం మొదలు కావడంతో భారీ వర్షాలు పడే పరిస్థితులు ఉండడంతో మళ్లీ ఇదే సమస్యను ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు, రోడ్డుకు ఇరువైపులా లోతైన కాలువలను ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

వదలని వాన.. వ్యాపారుల విలవిల



వెలవెలబోతున్న వేములవలస మార్కెట్

తగరపువలస: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రెండో రోజైన గురువారం కూడా వ్యాపారాలు వెలవెలపోయి వ్యాపారులు విలవిలలాడారు. మార్కెట్‌కు వచ్చే వినియోగదారుల సంఖ్య పలచగా ఉంది. దీంతో కూరగాయలు, ఆకుకూరలతో పాటు మాంసం వ్యాపారాలు పెద్ద గా సాగలేదు. పువ్వులు తడిచిపోవడంతో వ్యాపారులు నష్టపోయారు. పువ్వుల మార్కెట్ కూడా వర్షం కారణంగా బోసిపోయింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బంద్ పాటించడంతో వర్షం ప్రభావం విద్యాసంస్థలపై పెద్దగా ప్రభావం చూపలేదు.

పరశురామావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: భీమిలిలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలను నిర్వహించి, ఈ అవతారం గురించి అందరికీ వివరించారు.

రెండో రోజు 70 దరఖాస్తుల స్వీకరణ

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో యాజమాన్యం నుంచి రావలసిన బకాయిల కోసం కార్మికుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. రెండోరోజైన గురువారం 70 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. పీఎఫ్, గ్రాట్యుటీ, నష్టపరిహారం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మారుపేర్లు, వితంతువులకు పరిహారం, విద్యుత్ మీటర్ల డిపాజిట్‌లపై దరఖాస్తులు ఈ నెల 20 వరకు స్వీకరించనున్న సంగతి తెలిసిందే.

6న జ్యూట్ బాధిత సంఘం సమావేశం

తగరపువలస: ఈ నెల 6న ఉదయం 9 గంటలకు చిట్టివలస జ్యూట్‌మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘ సమావేశం భీమిలిలో నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి జీరు వెంకటరమణ తెలిపారు. సంఘం ముఖ్య నాయకులు, ఆఫీసు బేరర్స్‌తో న్యాయవాది జనార్థన్ ఇంటి వద్ద సమావేశం కానున్నట్టు తెలియజేశారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలపై అవగాహన

తగరపువలస: అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా సంతపేట జీవీఎంసీ అంబేడ్కర్ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వలన కలిగే ముప్పు గురించి ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు వివరించారు. సగటున ఒక్కో భారతీయుడు ఏడాదికి 11 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పోగవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలలో అయిదో వంతు భారతదేశం నుంచే వస్తోందని తెలియజేశారు. హానికారకమైన ప్లాస్టిక్‌కు బదులుగా కాగితం, వస్త్ర సంచులు వినియోగించాలని సూచించారు.

సంతపేటలో ఫాగింగ్

తగరపువలస: దోమల నివారణకు గాను జీవీఎంసీ భీమిలి జోన్ పారిశుధ్య సిబ్బంది 1,2 వార్డులలో గురువారం ఫాగింగ్ చేశారు. పెర్మిత్రిన్ రసాయన ద్రావణాన్ని సంతపేట, ఆదర్శనగర్, గొల్లవీధి, కుమ్మరవీధి ప్రాంతాలలో ఫాగింగ్ ద్వారా వదిలారు. దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి స్థానికులకు అవగాహన కల్పించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న శానిటేషన్, ఎండీఎం వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మంగశ్రీ

పద్మనాభం: పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని శానిటేషన్, ఎండీఎం వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగ శ్రీ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం నిర్వహించిన పాఠశాలల శానిటేషన్ వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి సెలవుల్లో సగం వేతనం కాకుండా పూర్తి వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా ఐదో తేదీన వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని, గుర్తింపు కార్డులివ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల తొమ్మిదో తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బందికి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రతినిధులు కె.లక్ష్మి, జి.సింహాచలం పాల్గొన్నారు.

అడ్మిషన్స్ పెంపుదలకు తక్షణ చర్యలు చేపట్టాలి

- డీఈవో ప్రేమ్‌కుమార్
- చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ సందర్శన



చంద్రంపాలెం హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

మధురవాడ: విద్యార్థులు ఎక్కువగా చేరేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలకు ఉపాధ్యాయులు వెళ్లి, వారికి అవగాహన కల్పించి పాఠశాలలో చేరే విధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రేమ్‌కుమార్ సూచించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలలో పిల్లల ప్రవేశాలు పెంచేందుకు మరిన్ని చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటరావును ఆదేశించారు. విద్యార్థులు 3 రోజులు దాటి సెలవులు పెడితే, కారణాలు తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారమివ్వాలని చెప్పారు. పాఠశాల తెరచిన దగ్గర నుంచి స్కూలుకు రాని పిల్లల ఇంటికి వెళ్లి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌సీవో జి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏఎంవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



డోలా రాము(ఫైల్)

కొమ్మాది: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎండాడలో చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివి.. విజయనగరానికి చెందిన డోలా రాము (38) పదేళ్ల క్రితం బతుకుతెరువు కోసం విశాఖ నగరానికి వచ్చారు. రామాటాకీస్ సమీపంలో స్క్రాప్ దుకాణం సొంతంగా ఏర్పాటు చేసుకున్నాడు. ఆయనకు భార్య లావణ్య, ఇద్దరు కుమారులు శశాంక్, రవితేజ ఉన్నారు. వీరు నాలుగు నెలల క్రితం జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. ఇక్కడి నుంచి రోజూ వెళ్లి, రామాటాకీస్ వద్ద స్క్రాప్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల రాము జూదం, ఆన్‌లైన్ అప్పులకు అలవాటుపడ్డాడు. దీంతో పెద్ద ఎత్తున అప్పులు చేయడంతో అవి తీర్చలేక గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇతని భార్య లావణ్య ఇంటికి వచ్చి చూసేసరికి రాము ఫ్యాన్‌కు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు. వెంటనే ఆమె ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

నోరు తెరిచిన ప్రమాదం



అంబేడ్కర్ కూడలిలో డ్రైనేజీపై తొలగించి వదిలేసిన పలకలు

తగరపువలస: స్థానిక అంబేడ్కర్ కూడలిలో డ్రైనేజీని శుభ్రం చేయడానికి తొలగించిన పలకలను నెలరోజులుగా పారిశుధ్య కార్మికులు అలాగే వదిలేశారు. వర్షాలు కురిసిన ప్రతీసారి డ్రైనేజీలో పూడికలు తొలగించడానికి సిబ్బంది డ్రైనేజీపై సిమెంట్ పలకలను తెరుస్తారు. పూడిక తొలగింపు తరువాత మూత పెట్టాల్సి ఉన్నా, తరచూ మరచిపోవడంతో, ఈ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదమరచి నడిచి వచ్చేవారు ఈ డ్రైనేజీలో జారి పడుతున్నారు. శానిటరీ కార్యదర్శులు ముందు జాగ్రత్తగా ఈ పలకలను మూసి ఉంచి, ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.